తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
25 ఏప్రిల్ 2025
పేజీలు : 08

# యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24 (జనంసాక్షి): యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.




వార్త మెయిన్ 7లో

# సరస్వతి పుష్కరాల పనుల్లో జాప్యం జరగొద్దు..

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సరస్వతి పుష్కరాల పనుల్లో ఎలాంటి జాప్యం జరగొద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. గురువారం సరస్వతి పుష్కర పనుల ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు, తహాశీల్దార్, ఎంపిడిఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.



వార్త మెయిన్ 7లో

# 27న ఏం జరగబోతోంది?

- ఉపాధి కల్పించేందుకు ఒకరు..
- పార్టీ ఉనికి కోసం మరొకరు..
- రసవత్తరంగా సాగుతున్న రాజకీయం..
- యువతను జాబ్ మేళాకు ఆహ్వానిస్తున్న కాంగ్రెస్..
- అదే రోజు రజతోత్సవ సభకు పిలుస్తున్న బీఆర్ఎస్..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ఈనెల 27న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతుంది. మరోవైపు అదే రోజు హనుమకొండ జిల్లాలో జరిగే రజతోత్సవ సభకు తరలిరావాలని బీఆర్ఎస్ పిలుపునిస్తుంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని యువత ఎటువైపు అడుగులేస్తారనే ఉత్కంఠ రేపుతుంది. రెండు పార్టీలు పోటాపోటీగా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాయి. తమ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ముందుకు సాగుతున్నాయి. అయితే పోటాపోటీగా ప్రచారాలు నిర్వహిస్తున్న ఇరు పార్టీల్లో ఏ పార్టీ నెగ్గుతుందోననే ఉత్కంఠ స్థానికంగా నెలకొంది.





వార్త మెయిన్ 3లో

# తప్పని తెలిసినా తప్పుడు పనులు చేస్తున్నారా?

- తప్పుడు పత్రాలతో పట్టా మార్పుకు కోటి రూపాయల ఒప్పందం
- తప్పని తెలిసినా పట్టాలు మార్చేందుకు ఓ రెవెన్యూ అధికారి విశ్వ ప్రయత్నం
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం

చెన్నూర్ రూరల్ ఏప్రిల్ 24 (జనం సాక్షి) : తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం, తప్పుడు కుటుంబ సభ్యుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలను వినియోగించి చెన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రెవెన్యూ అధికారులు తప్పుడు పనులు నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

8లో...

# కోటగుళ్ల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- రాబోయే రోజుల్లో ఆలయం మరింత అభివృద్ధి
- దేవదాయ శాఖ డివిజనల్ ఇన్స్పెక్టర్ నందనం కవిత

గణపురం, ఏప్రిల్ 24 (జనం సాక్షి): కోటగుళ్ల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవదాయ శాఖ డివిజనల్ ఇన్స్పెక్టర్ నందనం కవిత అన్నారు. గురువారం ఆమె సిబ్బందితో కలిసి కోట గుళ్ళ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.




4లో...

# పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ

- గాంధీభవన్‌లో టిపిసీసీ చీఫ్ సమక్షంలో పార్టీలోకి డా.పానుగోటి సోమేశ్వర్ రావు



**తొర్రూరు టౌన్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్దిని చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి క్యూ కడుతున్నారు. అందులో భాగంగా ఈ రోజు గాంధీ భవన్‌లో టిపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్, నియోజకవర్గ స్థాయి నాయకుడు డా.పొనుగోటి సోమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపిపి కంజర్ల ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీలు సొమ్ల నాయక్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ జాటోత్ సురేష్ నాయక్, రాజేందర్, భోజ్యా, బానోత్ శ్రీను, జాతోత్ నరేష్, పద్మా యకేందర్, రవి నాయక్, కృష్ణ మూర్తి, నరసింహ నాయక్, మైనారిటీ నాయకులు ఎం.డి. అన్వర్, యూత్ నుంచి వీరమనేని రాజు, గుగులోతు అశోక్, నెహ్రూ నాయక్, మహిళా విభాగం నుంచి కేతావత్ అనుజా, దారవత్ అనిత, విమల తదితరులు వున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ. మా అత్త కోడళ్ళను తక్కువ అంచనా వేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంకా. ఏదో ఆశతో ఉన్నారని, వారు ఆశలు వదులుకుంటే వారికే మంచిదని చెప్పారు. ఈ చేరికలు ఇంకా.కొనసాగుతాయని, ఇంకా చాలా మంది నాయకులు రావడానికి సిద్ధంగా ఉన్నారు అన్నారు. బిఆంఎస్ పనితీరు నచ్చకపోవడముతో కాంగ్రెస్‌లో చేరానుబి డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు పాలకుర్తి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఘోర పరాజయం పాలైనప్పటికీ. పాలకుర్తి నియోజకవర్గం నాయకుడు ఎలాంటి సమీక్షలు నిర్వహించకుండా, కనీసం బిఆర్ ఎస్ పార్టీ సంస్థ గత నిర్మాణం చేపట్టకుండా, గ్రామాల, మండలాల్లోని కార్యకర్తలను నిరుత్సాహపరిచే రీతిలో వ్యవహరించడంతో విసుగు చెందాను. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సేవా దృక్పథంతో అమెరికా నుంచి వచ్చి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పాలకుర్తి నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి హనుమాన్ల ఝాన్సీ రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి నిర్ణయించుకున్నాను. వారి సారథ్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని భావించి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. నాతో పాటుగా పార్టీలో చేరిన మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, ముఖ్య నాయకులందరికీ పార్టీలో సమచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నుండి తరలి వచ్చిన నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, పాల్గొన్నారు.

## సఖి సేవలపై మహిళలకు అవగాహన




**చెన్నారావుపేట, ఏప్రిల్ 24(జనంసాక్షి):** సఖి సెంటర్ సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని ఖాదర్‌పేట, జల్లి గ్రామాలలో మహిళ సంఘాల సభ్యులతో సర్వోదయ సంస్థ అద్వర్యంలో సఖి సెంటర్ వరంగల్ వారు అవగాహన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి పాల్గొని మాట్లాడారు. సఖిసెంటర్ మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల సంక్షేమశాఖ సర్వోదయ సంస్థ అధ్వర్యంలో పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు, పిల్లలకు అందించే సేవలను వివరిస్తూ మహిళల, బాలికల రక్షణ వారి భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తద్వారా బాధిత మహిళలకు కౌన్సిలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయము, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటూ అందిస్తామని తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళ హెల్ప్ లైన్ 181 కు కాల్ చేసినట్లయితే రెస్క్యూ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస వాటికి కారణాలు మహిళల బాలికల హక్కులు, చట్టాల గురించి ముఖ్యంగా గృహహింస చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఫోక్సో చట్టం వంటి వాటి పై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే మిషన్ వాత్సల్య పథకం, డ్రాప్ అవుట్ పిల్లల గురించి పిల్లల దత్తత గురించి వివరించడం జరిగింది. అనంతరం సఖి సేవలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేసు వర్కర్ తిరుమల, చైల్డ్ లైన్ సిబ్బంది సరిత, సుష్మ, సిసి మంజుల, వివోఏలు పర్వీన్, అస్మ, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కోటగుళ్ల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- రాబోయే రోజుల్లో ఆలయం మరింత అభివృద్ధి
- దేవదాయ శాఖ డివిజనల్ ఇన్స్పెక్టర్ నందనం కవిత





**గణపురం ,ఏప్రిల్ 24 (జనంసాక్షి):** కోటగుళ్ల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవదాయ శాఖ డివిజనల్ ఇన్స్పెక్టర్ నందనం కవిత అన్నారు. గురువారం ఆమె సిబ్బందితో కలిసి కోట గుళ్ళ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ విషయమై కోటగుళ్లు పరిరక్షణ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 43 సెక్షన్ కింద కోట గుళ్ళు దేవాలయం పేరున రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. దీంతో ఆలయం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు. ఆలయ నిర్వహణ పూర్తిగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలోనే కొనసాగుతుందని ఇందులో తమకు ఎలాంటి ప్రమేయం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఎన్ అర్చక సంఘం రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కార్యదర్శి కర్నే సాంబయ్య, డిడిఎన్ అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్,జిల్లా కోశాధికారి సాంబశివుడు, అర్చకులు గురు మూర్తి, చంద్రశేఖర్, రాజు, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు, మామిండ్ల మల్లికార్జున గౌడ్, సభ్యులు నాగపురి శ్రీనివాస్ గౌడ్, రౌతు కిషోర్, గొర్రె ఎల్లయ్య యాదవ్ చిలువేరు ఉదయాకర్, కొయ్యల గౌతమ్ గౌడ్, సామర్ల నాగరాజు, కొయ్యల రమేష్, తోట నవీన్, బాలాజీ నవీన్, పెద్ది ప్రశాంత్,ఆరెల్లి ఓంకార్, శంకర్ అంజి, పుప్పాల దీపక్, ఆనంద వర్ధన్, నల్లగొండ రాజు, గణేష్ ,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## 27న మెగా వైద్య శిబిరం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, (జనంసాక్షి) :** ఈనెల 27న బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాదారం ఎస్సై సౌమ్య తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. నరసాపూర్, ఎంవికె 3 ఇంక్లైన్, నీలాయపల్లి, మాదారం ప్రజలు మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన వైద్య బృందం చేత జనరల్ మెడిసిన్, ఫుల్ మోనాలజీ చెస్ట్ ఫిజీషియన్, ఆర్థోపెటిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఇఎన్టి, రేడియాలజీ, కార్డియాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, డెర్మటాలజీ, పైడాయాట్రిక్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఈకో, యూఎస్జి స్కాన్, పిఈటి, షుగర్, బిపి, కంటి వినికిడి టెస్టులు చేయబడుతాయన్నారు. సుమారు నాలుగు లక్షల రూపాయల విలువగల మందులను రోగులను పరిశీలించిన తర్వాత వైద్యుల సలహా మేరకు మందులను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం మాదారం పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు.

## నేను ఎవరికి ఐపి పెట్టలేదు : చిదురాల సతీష్



**మంగపేట ఏప్రిల్ 24(జనంసాక్షి):** నేను ఎవరికి కూడా డబ్బులు ఎగ్గొట్టి ఐపి పెట్టలేదు అని నాపై వచ్చే ఆరోపణలు అంతా అవాస్తవం అని చిదురాల సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కమలాపురం గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి కిరాణం షాపు నిర్వహిస్తూ జీవనం కొనసాగించుకుంటున్నాను. ఈ క్రమంలోనే వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులు తీసుకున్న మాట వాస్తవం అని కానీ ఎవరికి కూడా డబ్బులు ఎగ్గొట్ట లేదు కానీ వాళ్లకు ఇచ్చే డబ్బులకు కొంత గడువు కావాలని లాయర్ ద్వారా లీగల్ నోటీసులు మాత్రమే ఇచ్చాను అని సతీష్ తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం సిద్ధంశెట్టి శ్రీనివాస్ రావు పేరు మీద కరపత్రాలు కమలాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు వేయడం జరిగిందని అందులో నా పేరును కూడా చేర్చి శ్రీనివాస్ రావు ప్రోత్సాహంతోనే నేను బాకీలు ఉన్నవారికి డబ్బులు ఎగ్గొట్టినట్లు కరపత్రాలు ముద్రించారు. ఇది కేవలం శ్రీనివాస్ రావు ను బదనాం చేసి తనపై రాజకీయ కక్ష సాధింపు కోసమే ఇలా చేయడం దారుణమని సతీష్ తెలిపారు. నేను ఎవరికి ఎలాంటి ఐపి పెట్టలేదు నాకు ఎవరు డబ్బులు ఎగకొట్టాలని చెప్పలేదు అని ఇది పూర్తి అవాస్తవమని సతీష్ తెలిపారు. కమలాపురంలోనా పేరు మీద ఉన్న 40లక్షల రూపాయల విలువ గల ఇల్లు ఉంది అని దానిని అమ్మి బాకీ ఉన్న 18 మంది వ్యక్తులకు 8నెలల గడువు లోపు డబ్బుల చెల్లిస్తానని చెప్పడం కోసమే లాయర్ ద్వారా నోటీసులు మాత్రమే పంపినట్లు సతీష్ తెలిపాడు. ఈ విషయంలో సిద్ధంశెట్టి శ్రీనివాసరావు కు ఈ విషయంపై ఇటువంటి సంబంధం లేదని సతీష్ తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి పరమార్శ

- పాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య



**మల్హర్, ఏప్రిల్ 24(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గాదంపల్లి గ్రామానికి చెందిన గాదం కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగ కమలమ్మ కుటుంబ సభ్యులను గురువారం రోజున తాడిచర్ల ఫాక్స్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య పరమార్శించి ఓదార్చారు. కమలమ్మ ఆత్మకు శాంతి కలగాలని ప్రగాఢ సానుభూతిని తెలిపుతు మృతురాలి కుమారులు శ్రీనివాస్, బాలయ్య లకు మనోధైర్యం కల్పించారు. అధైర్య పడద్దు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది అని వారికీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అడ్వాల మహేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేకే ఓసీ కార్మికులకు హెచ్ఆర్ఏ చెల్లించాలి



**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, (జనంసాక్షి) :** కేకే ఓసీ కార్మికులకు పది శాతం హెచ్ఆర్ఏ చెల్లించాలని గురువారం కేకే ఓసీ మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. కేకే ఓసీలో పని చేస్తూ కంపెనీ క్వార్టర్లు లేని కార్మికులకు హెచ్ఆర్ఏ ఇవ్వడం లేదని, మిగితా గనుల్లో పని చేస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ ఇచ్చి కేవలం కేకే ఓసీలో పని చేస్తున్న కార్మికులకు మాత్రం హెచ్ఆర్ఏ ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి కేకే ఓసీ కార్మికులకు హెచ్ఆర్ఏ అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కేకే ఓసీ కార్మికులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాల అందజేత

**మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ**



**చెన్నారావుపేట, ఏప్రిల్ 24(జనంసాక్షి):** నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలను మండల విద్యా శాఖ అధికారిని బైరి సరళ గురువారం అందించారు. పిఆర్టియు టిఎస్ చెన్నారావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సేవా పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మార్సీ కార్యాలయంలో చేపట్టారు.సమాజంలో ఉపాధ్యాయ స్థానం ప్రముఖమైందని సమయపాలన పాటించి విద్యావ్యవస్థ పటిష్ఠానికి నూతన ఉపాధ్యాయులు పాటుపడాలని కోరారు. పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి నూతన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత ఆశయాలతో అకుంఠిత దీక్షతో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేసి ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో శక్తి వంచన లేకుండా పనిచేసే అందరి మన్ననలు పొందాలని కోరారు. 2024 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు సర్వీస్ లో జాయినింగ్ నుండి వారి వెన్నంటే పనిచేస్తూ ఎంప్లాయ్ ఐడి, పాన్ కార్డ్ నంబర్, టిఎస్ జిఎల్ఐ నెంబర్, క్యాడర్ స్ట్రెంత్, జీతాల చెల్లింపులలో తీవ్రంగా శ్రమించిన చెన్నారావుపేట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజరి సురేందర్ గౌడ్, బానోత్ వెంకన్నలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఏకకాలంలో మండలంలోని 20 మంది నూతన ఉపాధ్యాయులందరికీ సేవా పుస్తకాలు చక్కగా రాసి అందించడంలో తోడ్పడిన మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి నీలం రమేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మండల శాఖ అధ్యక్షులు పూజారి సురేందర్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో నియమితులైన నూతన ఉపాధ్యాయులందరూ పిఆర్టియు సభ్యత్వం స్వీకరించడం సంతోషదాయకమని వారికి ఎల్లవేళలా మండల శాఖ సర్వీస్ సమస్యల పరిష్కారంలో ముందుంటుందని చక్కని విద్యా బోధన ద్వారా మండలానికి ప్రత్యేక గుర్తింపు తేవడంలో నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. డీఎస్సీ 2004 నూతన ఉపాధ్యాయులు ఎంఆర్సీ కార్యాలయానికి బహుకరణగా గోడ గడియారాన్ని మండల విద్యాధికారికి బహుకరించారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ పరుపాటి సుధాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బానోత్ వెంకన్న, మండల శాఖ బాధ్యులు చందావత్ ఈర్య, నూతన ఉపాధ్యాయులు బొమ్మెర సతీష్, సవుదారపు రాజు, పరమేశ్వర్, మధుబాబు, మాధవి, రత్న సింధూర్, సుదర్శనచారి, బోడ సుజాత, ముత్తినేని అనూష, జక్కుల అశోక్, సంఘపు కార్తీక్, నౌషీన్ జర, మర్ద ప్రత్యూష, అంబటి అక్షయ, సుమత, శ్రీలక్ష్మి, పులిశేరు మహేష్, బోడ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిని వేధింపులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎన్‌హెచ్‌ఆర్ సి ఇంచార్జి గారే జయరాజ్ డిమాండ్



**పర్వతగిరి,ఏప్రిల్ 24,(జనంసాక్షి):** రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రియాంక ఓ రాజకీయ పార్టీ నాయకులు వేధిస్తున్నారని వారి పేర్లతో లేఖ రాసి తీవ్ర మనస్తాపానికి గురై ఇంటి నుండి వెళ్లిన ఘటనపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకో వాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ వరంగల్ గ్రేటర్ కమిటీ మరియు పర్వతగిరి మండల ఇన్చార్జి అయిన గారె జయరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారని వారిని వ్యక్తిగతంగా వేధించడం మూర?పుచర్య అని అన్నారు. అలాంటి వారిపట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక ఒత్తిడిల మధ్య ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రజలకు చేరవేస్తున్న పంచాయతీ కార్య దర్శులను రాజకీయ నాయకులు వేధించడం సరికాదని అన్నారు. ఇటువంటి ఘటనల పట్ల ప్రభుత్వం, ఉన్నతాధి కారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తన లేఖలో రాసిన పేర్లు గల వ్యక్తులను విచారించి తప్పు నిరూపణ అయితే వారి పైన చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పార్టీప రమైన క్రమశిక్షణ చర్యలు తీసు కొని వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# భూభారతి చట్టంతో రైతుకు మేలు

- భూ సమస్యల త్వరితగతిన పరిష్కారం కోసమే భూభారతి చట్టం
- ఎమ్మెల్యే జి ఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**చిట్యాల /మొగుళ్లపల్లి/ టేకుమట్ల (జనంసాక్షి):** ధరణిలో ఉన్న లోపాల దృష్ట్యా రైతుల ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక, టేకుమట్ల మండల కేంద్రంలోని అమ్మ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.ఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టం యొక్క అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ లో పభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వే యర్ ద్వారా హద్దులు తో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుంది. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డీఓ, ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని ఎమ్మెల్యే గంధ సత్యనారాయణ రావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పహణి కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధరణి వచ్చిన తరువాత పహణిలో నమోదులు జరగలేదు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, గత 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12-10-2020 నుండి 10-11-2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం సన్న చిన్నకారు రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డిఓ విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ప్రకారం భూ హక్కులు జారీ చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవి, తహశీల్దార్ సునీత, హేమ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీదేవి పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద



**చిట్యాల,ఏప్రిల్24 (జనంసాక్షి):** అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి నవీన్ అన్నారు.గురువారం మండంలోని జూకల్ అంగన్వాడీ కేంద్రం1లో ఆన్యువల్‌డేను,అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద పంచాయతీ సెక్రెటరీ నవీన్ పాల్గొన్నారు. అనంతరం వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు, యూకేజీ ఎల్కేజీ బుక్స్ తో పాటు వివిధ రకాల పోస్టర్స్, అంకెల చార్ట్ లతొ ఆట పాట కథ ద్వారా ప్రైమరీ స్కూల్‌కు సంసిద్ధులుగా తయారుచేసి నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదుగుతారు. తల్లి దండ్రులు ప్రైవేట్ స్కూలుకు పంపించకుండా అంగన్వాడి కేంద్రాలకు పంపిస్తే పిల్లలు ఆరోగ్యంగా శారీరకంగా ఎదుగుదల బాగుంటుందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ సరిత,విజయలక్ష్మి, ఆయాసమ్మక్క, ఆశ పార్వతి పాల్గొన్నారు.

## ఉగ్ర దాడికి నిరసనగా విధులు బహిష్కరణ



**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, (జనంసాక్షి):** జమ్ముకాశ్మీర్లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి మరణాహెూమం చేయడాన్ని ఖండించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతులకు న్యాయవాదులు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి చేను రవికుమార్, సీనియర్ న్యాయవాదులు గోపికిషన్‌సింగ్, ఎల్‌రాము, పసులసురేష్, అశోక్, సింగతి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి సంస్కృతిలో ఇప్ప పువ్వుకు ప్రత్యేకస్థానం

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్






**ఖానాపూర్ ఏప్రిల్ 24 (జనంసాక్షి):** ఆదివాసి సంస్కృతి సాంప్రదా యాలలో అడవిలో లభించే ఇప్ప పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంటుందని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూరు మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఇప్పపువ్వు పం డుగను ఆయన ప్రారంభించారు. ఇప్పి పువ్వుతో తయారుచేసిన లడ్డు లతోపాటు జొన్న గట్కా, మక్కగట్కా, గారెలు తదితర వంటకాల స్టాల్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పపువ్వు తో అనేక ఆరోగ్య ఫలాలు చేకూరుతాయని అన్నారు. ప్రధానంగా రక్తహీనతతో బాధపడుతున్న వారు ఇప్పపువ్వు లడ్డు స్వీకరించినట్లయితే సత్ఫలి తాలు లభిస్తాయని సూచించారు. ఆదివాసీల జీవితాలతో ఇప్పపువ్వు విడదీయని బంధం ఉందని ప్రతి ఒక్కరూ ఇప్పపువ్వును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, ఎస్పీ అఖిల్ మహాజన్, జాయింట్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమురు ఈశ్వరి బాయి, జిల్లా సార్మేడి దుర్గా పటేల్‌లతోపాటు వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మండల అధ్యక్షులు

**పర్వతగిరి,ఏప్రిల్24,(జనంసాక్షి):** గురువారం రోజు మండలంలో గుగులోత్ తండ గ్రామంలో చౌటపల్లి సొసైటీ వారి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాలుతరుగు పేరుతో రైతులను నిండ మచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర తో పాటు 500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోరడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18 గంటలు ఈ ప్రజా ప్రభుత్వం కొరకు అహర్నిశలుగా కృషి చేస్తున్నారని శ్రీనివాస్ నాయక్ తెలిపారు.తమ నాయకుడు శాసనసభ్యులు కెఆర్ నాగరాజు బడుగు బలహీన వర్గాల కోసం రైతుల సంక్షేమం కొరకు తమ నాయకుడు పనిచేస్తున్నారని శ్రీనివాస్ నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బానోత్ చెందు నాయక్,మహిళ మండల అధ్యక్షురాలు మాసాని సువార్త,సొసైటీ సీఈఓ వెంకటయ్య,సెంటర్ ఇన్చార్జి కుమార్,కార్యదర్శి అరుణ,సీనియర్ నాయకులు మాసాని యాకూబ్,వీరన్న,మాజీ సర్పంచ్ మోతిలాల్, సునీల్,భద్రా సింగ్,రమేష్, చల్ల వెంకన్న,హమాలి సంఘం నాయకులు,గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వరి కోతల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, (జనంసాక్షి):** రైతులు వరి కోతల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల ఏఈఓ రాంచందర్ సూచించారు. వరికంకులు పూర్తిగా ఎండిన తర్వాత కోతలు చేసు కోవాలన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చే ముందు తేమ 17 కంటే తక్కువ ఉండే విదంగా చూసుకోవాలన్నారు. తాలుతప్ప లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలు మోసపోవద్దని కోరారు.

## చిన్నారిని ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**పాలకుర్తి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు దాసరి మధు కూతురు చిన్నారి ఐశ్వర్య నూతన పుష్పాలంకరణ కార్యక్రమానికి గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై చిన్నారిని ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేశారు, ఆయన వెంట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కదుదుల కరుణాకర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి కృష్ణ, నాయకులు పసుల వెంకటేష్, బొమ్మిశెట్టి సోమనర్సయ్య, పొన్నంయాకయ్య, పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



**పాలకుర్తి, ఏప్రిల్ 24(జనంసాక్షి):** ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి కేంద్రంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయ వంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కోరారు. గురువారం మండలంలోని హత్యాతండా, మేకలతండా, టీఎస్కి తండా, పెద్ద తండా (కే), తీగారం, వల్మిడి, దద్దెపల్లి, గోపాలపురం గ్రామాల్లో బీఆర్ ఎస్ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోవాలని, లెక్కలేనంత మందిని తరలి రావాలని కోరారు,ఈ కార్యక్రమంలో నాయకులు జరుపుల బాలూ నాయక్, పాపారావు, వేణు, కత్తి సైదులు, కారుపోతుల వెంకటయ్య, సురేష్, బాలూ నాయక్, లకావత్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా చర్యలు తీసుకోవాలి

### ఎంసీపీఐయూ డిమాండ్




**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, (జనంసాక్షి):** సంక్షేమ పథకాలను అర్హులకే అందేలా చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించే విధంగా అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న కొంతమంది నాయకులపై, వారికి సహకరించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరి వద్ద నుండి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని ఎంక్వయిరీ చేసి తప్పుడు సమాచారం అందించిన వారికి భవిష్యత్తులో ఎటువంటి ప్రభుత్వ పథకాలు రాకుండా అనర్హత వేటు వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవే శపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం పేర్ల జాబితాలో అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయని, పారదర్శకత లేకుండా కొంతమంది అధి కారులు సర్వే నిర్వహించారని, కొం తమంది కమిటీ నాయకులు ఏ పేరు చెప్తే ఆ పేర్లను మాత్రమే జాబితాలో పొందుపరిచారని, దీనివల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. కూలి నాలి చేసుకునే వాళ్లకు తప్ప సింగరేణి రిటైర్మెంట్ కార్మి కులకు, వ్యవసాయ భూములు కలిగి న వాళ్లకు, సొంత ఇల్లు ఉన్న వారి పేర్లను కూడా ఈ లిస్టులో చేర్చారని ఆరోపిం చారు. ఎన్నో ఏళ్ల నుండి అద్దె రూము లలో నివసి స్తున్న వారి పేర్లు మాత్రం ఈ జాబి తాలో రాలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల విషయాలలో చాలా మంది నాయకులు పైరవీలు చేస్తూ అమాయక ప్రజల నుండి డబ్బులుదండు కుందామని ఆలో చనలో ఉన్నారని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అర్హులకు కాకుండా అన ర్హుల పేర్లు నమోదు చేసిన సర్వే అధికారులపై వారిపై ఒత్తిడి తెచ్చి పేర్లు నమోదు చేసేలా చేసిన నాయ కులపై శాఖా పరమైన చర్యలు తీసుకో వాలని, నిజమైన అర్హులను ఎంపిక చేయాలని వద్ద నుండి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకొని సంబంధిత అధికారులు ఎంక్వయిరీ చేసి తప్పుడు సమాచారం అందించిన వారిపై తగు చర్యలు తీసుకొ వాలని అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రభుత్వ పథ కాలకు అర్హులు కాకుండా వారిపై అనర్హత వేటు వేయాల ని అప్పుడే నిజమైన అర్హులు లబ్ధిపొందు తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, పాల్గొన్నారు

# నిబంధనలు పాటించని ప్రైవేటు హాస్పటల్స్ పై చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు





**ములుగుప్రతినిధి, ఏప్రిల్24 (జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రవేట్ హాస్పిటల్స్ యజమాన్యంతో మీటింగ్ నిర్వహించారు. ప్రవేట్ హాస్పిటల్ యజమాన్యంతో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం, నియమ నిబంధనలు పాటించాలని, హాస్పటల్ యందు ధరల పట్టికలు, సేవలందించే డాక్టర్ల పేర్లను డిస్ప్లే చేయాలని, బయో- మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్, ఫైర్ సర్టిఫికెట్ ఉండాలని, లేనియెడల, ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్- 2010 ప్రకారం హాస్పిటల్స్ పై చర్య తీసుకోబడుతాయని, నిబంధనలు పాటించని ప్రవేట్ హాస్పిటల్‌కు 10.000 నుండి 5,00,000(ఐదులక్షల) వరకు జరిమానా విధించబడతాయని తెలిపారు. పిసి - పియన్డిటి ఆక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేయకూడదని తెలిపారు. ఏవైతే ప్రైవేట్ హాస్పి టల్స్ లింగ నిర్ధారణ చేసినట్లు నిర్ధారణ అయితే వారిపై ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్‌లో చేసిన వైద్య సేవలను, హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో 5వ తారీకు లోపల నమోదు చేయాలని ఎస్ఓ సరూప రాణి ప్రైవేట్ హాస్పిటల్ యజ మాన్యానికి హెచ్ఎంఐఎస్ పోర్టల్ గురించి ట్రైనింగ్ ఇచ్చినారు. రాబోయే వర్షాకాలంలో మలేరియా, డెంగు పరీక్షలు చేసినప్పుడు పాజిటివ్ కేసెస్ నిర్ధారణమైనప్పుడు జిల్లా కార్యాలయానికి సమాచారాన్ని అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ తల్లి ఆరోగ్యం మరియు పోషణాధికారి డాక్టర్ శ్రీకాంత్, జిల్లా ప్రోగ్రాం శిశు ఆరోగ్యం మరియు వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ రణధీర్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, పూర్ణ సంపత్ రావు, ఎస్ఓ స్వరూప రాణి, మానిటరింగ్ సూపర్వైజ ర్ సురేష్ బాబు, డిఈఓ నిఖిల్ ,ప్రైవేటు హాస్పిటల్స్ యజమాన్యం పాల్గొన్నారు.

# చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేకలోక్ అదాలత్

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ




**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 24(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిమిత్తమై న్యాయ మూర్తి గురువారం ఉదయం వరంగల్ న్యాయ సేవా సదన్‌లో న్యాయ మూర్తులు, న్యాయవాదులు, బ్యాంకు, చిట్ ఫండ్ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లా డుతూ "సాధారణంగా చెల్లని చెక్కులకు సంబంధించిన క్రిమినల్ మరియు సివిల్ కేసులు రెండు దాఖలు చేస్తారని, ఏదైనా ఒకదాంట్లో రాజీ పడినట్ల యితే రెండు కేసుల నుంచి కక్షిదారులకు విముక్తి లభిస్తుందన్నారు. చెక్ బౌన్స్ కేసులలో ముద్దాయి కోర్టుకు రానట్లయితే కోర్టులు అరెస్ట్ కు వారంటూ జారీ చేస్తాయని, ఈ కారణంగా ముద్దాయి జైలుకు వెళ్లినప్పటికీ, అతను డబ్బు చెల్లించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేడని తెలిపారు. అందువల్ల ఇటువంటి కేసుల్లో ఇరుపక్షాలు రాజీమార్గంలో కేసు ముగించుకోవాలని సూచించారు. బ్యాంకులు, చిట్ ఫండ్ కంపెనీలు తదితరులు తాము దాఖలు చేసిన చెల్లని చెక్కుల కేసులకు సంబంధించి ఋణ గ్రహీతతో రాజీ పడే విషయాన్ని చురుకుగా పరిశీలించాలని కోరారు. చెక్ బౌన్స్ కేసుల రాజీ కుదుర్చుకునే ఉద్దేశంలో ఉంటే న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి, మధ్యవర్తిత్వం ద్వారా కేసును ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చు కోవాలని కోరారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ 05-05-2025 నుండి 19.05.2025 వరకు ప్రి-లోక్ అదాలత్ మరియు 09.06.2025 నుండి 14.06.2025 వరకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించబడును అని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, వరంగల్ జిల్లా న్యాయమూర్తులు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ బాబు, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు, చిట్ ఫండ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ బిజెపి,

# కాంగ్రెస్ పార్టీల నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన





**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** జమ్ముకాశ్మీర్ పహల్గాంలో భారతీయులపై ఉగ్రవాదులు చేసిన దాడులను నిరసిస్తూ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సూపర్ బజార్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తూ వారి కుటుంబానలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ధన్ సింగ్, రాష్ట్ర నాయకులు ఆరుముల్ల పోషం మాట్లాడుతూ కాశ్మీర్ అందాలను చూడడానికి వచ్చిన పర్యాటకులను హిందువులని తెలుసుకొని మరీ దారుణంగా కాల్చి చంపడం హేయనీయమైన చర్య అని వాపోయారు. ముష్కరులు చేసిన ఈ దాడికి దీటుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం తగిన గుణపారం త్వరలోనే చెప్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ డౌన్ డౌన్, భారత్ మాతాకీ జై అంటూ నాయకులు నినాదాలు చేశారు. ఇది ఇలా ఉండగా కేంద్ర బలగాలు, కేంద్ర ప్రభుత్వం అలసత్వంతోటే భారతీయులపై ఉగ్రవాదుల దాడులు జరుగుతున్నాయని పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాశ్మీర్ లోకి వచ్చిన పర్యాటకులను లష్కర్ తోయిబా ఉగ్రవాదులు 26 మంది భారతీయులను హతమార్చడంపై తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో ఇంత పెద్ద మరణ హోమం జరుగుతుంటే నిఘా వర్గాలు నిద్రలో తేలుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మరణించిన వారి చిత్రపటాలకు స్థానిక రాజీవ్ చౌక్‌లో పూలమాలవేసి నివాళులర్పించారు. నిరసన తెలిపిన వారిలో బిజెపి నాయకులు వేముల అశోక్, ఈశ్వర చారి, వైద్య శ్రీనివాస్, సాయి కృష్ణ, సంతోషం నాయక్, రామ్ కిషోర్, దేవేందర్, రాజయ్య, గడ్డం సంపత్, రమేష్, శ్రీలత, రజని, ధనలక్ష్మి, హరిప్రసాద్, శెట్టి రమేష్, రవీందర్, కాంగ్రెస్ నాయకులు జంగం కల, సాగర్ రెడ్డి, వేణు, గోపు రాజం, రాజేష్, ప్రేమ్ సాగర్, కనకరాజు, కుమార్, రవి, సల్మాన్, సాగర్, అనిరుద్‌లు పాల్గొన్నారు.

# ముదిరాజ్ కులస్తులను బిసిడి నుండి బిసిఏకి మార్చాలి



**నల్లబెల్లి ఏప్రిల్ 24 (జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుండి బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ మాజీ పాలకమండలి సభ్యుడు గుండాల మదన్ కుమార్ అన్నారు. ముదిరాజ్ హక్కుల సాధనకై తెలంగాణ ముదిరాజ్ సమాజ్ ఆధ్వర్యంలో దారం యువరాజు బృందం సమ్మక్క సారలక్క గద్దెల నుండి పాదయాత్రగా బయలుదేరి నల్లబెల్లికి వచ్చిన సందర్భంగా నల్లబెల్లి మండల ముదిరాజ్ మహాసభ నాయకుడు దామ సాంబయ్య, గ్రామ అధ్యక్షుడు పాండవుల రాంబాబు ఆధ్వర్యంలో గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మదన్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ముదిరాజ్ కులస్తులకు అందవలసిన రిజర్వేషన్ ఫలాలు అందకుండా పోతున్నయన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ముదిరాజులను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. 2009లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన జీవో 15ను అమలు చేయమని సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చిన, కెసిఆర్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముదిరాజులను బిసి-డి నుండి బిసి ఏ కు మారుస్తామని వాగ్దానం చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా ముదిరాజ్ కులస్తులను బిసి-డి నుండి బీసీఏ కు వెంటనే మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. అనంతరం నల్లబెల్లి నుండి రుద్రగూడెం వరకు పాదయాత్ర కొనసాగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గోనెల పద్మ నరహరి, శ్రీశైలం, కుమార్, స్వామి, మనోజ్, జంపయ్య, వెంకటేష్, నర్సింగం, కుమార్, మహేందర్, నరేష్ పాల్గొన్నారు.

### గ్రామ పాలన అధికారుల

## నియామకంతో భూసమస్యలకు సత్వర పరిష్కారం




**నిర్మల్‌రూరల్,ఏప్రిల్24(జనంసాక్షి):** గ్రామ పాలన అధికారుల నియామకంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుం దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలి పారు. గురువారం నిర్మల్ జిల్లా నర్సాపూర్ 'జి' మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లా డుతూ ప్రజల భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలుగా నూతన భూభారతి చట్టంరూపొం దించబడిందని తెలిపారు. ఎంతోమంది అనుభవజ్ఞులైన అధికారులు, భూ చట్టాల నిపుణులు,న్యాయ నిపుణులు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసు కొని, ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను పరిశీలించిన తర్వాత సమగ్ర భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు.నూతన భారతి చట్టం అమలుతో తహసీల్దార్ స్థాయి లోనే ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రాబోతుందని అన్నారు. భూభారతి చట్టం లభిస్తుందని వారికి హామీ ఇచ్చారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తహసిల్దార్ శ్రీని వాస్,ఎంపీడీవో పుష్పలత, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, రైతులు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గం ఘటన పిరికిపంద చర్య

- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



**శాయంపేట, ఏప్రిల్24 (జనంసాక్షి):** జమ్మూకాశ్మీర్లోని పహాల్గం పై ఉగ్రదాడి పిరికిపంద చర్య అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి దాడికి నిరసనగా గురువారం మండల కేంద్రం లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుచ్చి రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని దెబ్బ తీయలేరని అన్నారు. ఉగ్రవాదం పై కేంద్రం కఠినంగా వ్యవహరించాలని కోరారు. భారతీయులందరూ సంఘటితంగా నిలవాల్సిన సమయం ఇది అని అన్నారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చల్ల చక్రపాణి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి ,రఫీ, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్ ,మారపల్లి రాజేందర్ ,రాజు ,కట్టయ్య, మస్క కుమార్, జగన్, వీరన్న, రాము, పాల్గొన్నారు.

## వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలు పట్ల తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**- మొగుళ్ళపల్లి ఎస్ఐ బి.అశోక్**



**చిట్యాల/ మొగుళ్ళపల్లి (జనంసాక్షి) :** వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలపై తల్లింద్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళ పల్లి ఎస్ఐ బి.అశోక్ తల్లిదండ్రులకు సూచించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో విపరీతంగా వడగాలులు వీస్తూ ఎండలు కొడుతున్నందున పిల్లలను ఎండలో తిరగనివ్వకుండా చూడాలన్నారు. లేకుంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. అలాగే పిల్లలు స్నేహితులతో కాకుండా తల్లిదండ్రుల సమక్షంలోనే ఈత నేర్చుకునేలా జాగ్రత్తలు తీసుకో వాలని తలిదండ్రులను కోరారు. స్నేహితులతో మాత్రం ఈతకు పంపిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుం దన్నారు. ద్విచక్ర వాహనా లను మాత్రం పిల్లలకు ఇవ్వద్దని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. వేసవి సెలవులు ఆనందంగా గడపా లంటే పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

## లేబర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మల్లంపల్లిలో చలివేంద్రం ప్రారంభం




**ములుగు ప్రతినిధి,ఏప్రిల్ 24(జనంసాక్షి):** మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ములుగు జిల్లా లేబర్ ఆఫీసర్ వినోద ఆధ్వర్యంలో భవన కార్మిక సంఘం ములుగు జిల్లా ఉపాధ్య క్షుడు మాతంగిశ్యాం సుందర్ పర్యవేక్షణలో గురువారం మల్లంపల్లి మండల కేంద్రంలో చలి వేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తుక్కుల ఐలయ్య, దయ్యాల రవి, అశోక్, గొర్రె కుమార్, మునిపాక రఘుపతి, వీరన్న, అమర్‌సింగ్,కుమార్, సారంగం, గుర్రాల అజిష్ పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన తహసిల్దార్

**నల్లబెల్లి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** సెలవు పై వెల్లిన నల్లబెల్లి మండల తహసిల్దార్ ముప్పు కృష్ణ గురువారం విధుల్లో చేరారు. ఈ సంద ర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కులము, ఆదాయం, నివాసధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ, భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుండి తాసిల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటా నని దీనిని ప్రజలు, రైతులు గమనించాలని కోరారు. సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ, రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయని తెలియజేశారు.



# యువతి ఆత్మహత్య

**ఖానాపూర్ ఏప్రిల్ 24 (జనంసాక్షి):** మండలంలోని కొలాంగూడా గ్రామానికి చెందిన ఆత్రం స్వప్న (18) అనే యువతి తల్లిదండ్రులు తన ప్రేమను నిరాకరించారని మనస్థాపనతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మృతరాలి తండ్రి దేవ రావు తల్లి చిన్నవ ఓమ్మలు మృతురాలు ప్రేమించిన వ్యక్తితో వివాహం నిరాకరించడంతో మృతురాలు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించారు. గత బుధవారం సాయంత్రం మృతురాలు గుర్తు తెలియని పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి స్థానిక ప్రభు త్వాసుపత్రికి తీసుకురావడంతో ఇక్కడి నుండి వైద్యులు ఉన్నత వైద్యం కోసం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపిం చారు. మృతురాలు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి దేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.



# ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి

- లారీల వేగాన్ని నియంత్రించాలి
- రోడ్డు ప్రమాదాలను నివారించే బాధ్యత ప్రభుత్వానిదే
- ప్రమాదం జరిగితే లారీ ఓనర్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్
- ప్రమాద చట్టాలు లోపభూయిష్టంగా ఉన్నాయని మండిపాటు
- ప్రమాద చట్టాలను మార్చాలి

**నూగూర్ వెంకటాపురం ఏప్రిల్ 24(జనంసాక్షి):** ఇసుక లారీల అతి వేగం కారణంగానే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు...బుధవారం రాత్రి ఏటూరునాగారం సమీపంలో రాంగ్ రూట్ లో వచ్చిన లారీ ద్విచక్ర వాహనం పై వస్తున్న కల్లూరి రవి కిరణ్, మట్టి రవి శంకర్ బైక్ ని ఎదురుగా వచ్చి బలంగా ఢీ కొట్టడం తో కల్లూరి రవి కిరణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా దెబ్బలు తాకి కోమాలోకి వెళ్ళినాడని నర్సింహా మూర్తి తెలిపారు. ఇసుక లారీల అతి వేగం, ఓవర్ టేకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, చరవాణిలో మాటాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు.ఇప్పటికే వందల సంఖ్యలో కుటుంబాలు రోడ్డున పడ్డాయాని అన్నారు. ప్రభుత్వం ఇసుకను తరలించడంలో ఉన్న శ్రద్ధ రోడ్డు భద్రతా ఏర్పాట్లు చేయడంలో, లేదన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల ప్రజలు రోడ్డు పై ప్రయాణం చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇసుక లారీలను రాత్రి పది గంటలు దాటిన తర్వాత రోడ్డు పై నడిపే విధంగా మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకరా టిఎస్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదం జరిగితే లారీ డ్రైవర్ ప్రమాదానికి గురైన క్షత గాత్రుడిని వదిలేసి పారిపోతున్నారని దీనివల్ల మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టం కింద కేసు నమోదు చేసి పది లక్షల రూపాయలు బాధిత కుటుం బాలకు చెల్లించే విధంగా చొరవ చూపా లని పోలీస్ అధికారులను కోరినారు.



ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని సం బంధిత లారీ ఓనర్ బాధ్యతగా తక్షణమే వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన బాధితుడే లాయర్ ని పెట్టుకొని కోర్టు కు వెళ్లి ఇన్సూరెన్స్ డబ్బులు తెచ్చుకోవడం సాధ్యం కాదన్నారు. ఆలా చేస్తే వచ్చే ప్రమాద భీమాలో లాయరే సగం డబ్బులు తీసుకు ంటాడని అన్నారు. ప్రమాదం జరిగిన రెండేళ్లకు మూడేళ్లకు ఆ భీమా వస్తుందని తెలియజేసారు. చాలా మంది ప్రజలకు తెలియక కూడా నష్టపోతున్నారని అన్నారు. యాక్సిడెంట్ చట్టాల్లో స్పష్టత లేదని పూర్తిగా లోప భూయిష్టంగా ఉందన్నారు . ప్రమాదానికి గురైన వారే కోర్టుల చుట్టూ తిరిగి నష్టపరిహారం తెచ్చుకోవడం ఏమిటన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రమాద భీమాకు సంబంధించిన చట్టాలను మార్చాలని డిమాండ్ చేశారు. రోడ్డు పై ప్రయాణం చేసే ప్రయాణికులకు కనీస భద్రత కరువైందన్నారు. లారీల కింద పడి పశువుల కంటే హీనంగా గతిలేని చావులు చస్తున్నారని ఆవేదన చెందినారు. ఇప్పటి వరకు లారీ ప్రమాదాలకు గురై చనిపోయిన వారి వివరాలు చెకరించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి0న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల రవాణా భద్రతా దృష్ట్యా లారీలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# తప్పని తెలిసినా తప్పుడు పనులు చేస్తున్నారా

- తప్పుడు పత్రాలతో పట్టా మార్పుకు కోటి రూపాయల ఒప్పందం
- తప్పని తెలిసినా పట్టాలు మార్చేందుకు ఓ రెవెన్యూ అధికారి విశ్వ ప్రయత్నం
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం







**చెన్నూర్ రూరల్ ఏప్రిల్ 24 (జనంసాక్షి):** తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం, తప్పుడు కుటుంబ సభ్యుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలను వినియోగించి చెన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రెవెన్యూ అధికారులు తప్పుడు పనులు నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 56ఎకరాల మండలంలోని ఆస్నాద్ గ్రామ శివారులో గల భూములను ఓ అనామకుడి పేరున మార్చేందుకు గానూ చెన్నూరు పట్టణానికి చెందిన ఓ దస్తావేజు లేఖరి, ఎమ్మెల్యే అనుచరుడైన ఓ కాంగ్రెస్ నేతలతో కలిసి చెన్నూరు రెవెన్యూ అధికారులతో కోటి రూపాయల ఒప్పందం కుదుర్చుకుని భారీ కుంభకోనానికి తెర లేపుతున్నారు. 75ఏళ్ల నాటి మహ్మద్ మూసా, రహీం అనే ఇద్దరు నావాబులు ఉమ్మడి పట్టాదారులగా 56ఎకరాల భూమి కలిగి ఉండగా, వారి పేరున గల భూములను పక్కా ప్రణాళికలతో ఛేజిక్కించుకునే ప్రయత్నంగా, వారిరువురిని తండ్రీ, కొడుకులుగా పేర్కొంటూ చెన్నూరు మున్సిపల్ కార్యాలయం నుండి తప్పుడు ధ్రువీకరణ పత్రం పొందడమే కాకుండా ఓ అనామకుడిని వారి వారసునిగా పేర్కొంటూ నిర్మల్ జిల్లా కేంద్రం నుండి ఓ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం సృష్టించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ కీలక రెవెన్యూ అధికారి సైతం అక్రమార్కులకు సహకరిస్తుండగా, తప్పుడు పద్దతిలో పట్టాలు మార్చి అట్టి భూములను సాగు చేసుకుంటున్న అమాయక రైతుల వద్ద కోట్లలో వసూళ్లు చేసినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇట్టి విషయమై స్థానిక తహసీల్దార్ మల్లిఖార్జున్ ను వివరణ కోరగా, మహ్మద్ మూసా, రహీం అనే ఇరువురు వ్యక్తుల పేరున 75ఏళ్లుగా ఆస్నాద్ శివారులో భూములు ఉన్నట్లు రికార్డులు నమోదు చేసి ఉండగా, ఇటీవలే అట్టి భూములు మూసా పేరున మార్చబడినా అందుకు సంబంధించిన పత్రాలు కార్యాలయంలో లేవని, కొద్ది రోజుల క్రితం జావీద్ అనే వ్యక్తి మూసా అతని తండ్రిగా పేర్కొంటూ మరణ ధ్రువీకరణ పత్రంతో అట్టి భూములకు అతడే వారసుడుగా తెలిపే కొన్ని ధ్రువీకరణ పత్రాల ద్వారా విచారణ చేపట్టి పట్టాలు మారుస్తున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు.

# బొడ్రాయి ప్రతిష్ట ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన పొట్లపల్లి శ్రీధర్ రావు

**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఈనెల 27 నుండి 30 వరకు జరుగు శ్రీ భూలక్ష్మి(బొడ్రాయి) ప్రతిష్టాపన, శ్రీ షణ్ముఖేశ్వర ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవకార్యక్రమానికి మాజీ ఉపముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ 27 ఆదివారం రోజున విగ్రహాల ఊరేగింపు, 28 సోమవారం రోజున గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృక పూజ, పంచ గవ్వ ప్రాసన, హోమములు తీర్థ ప్రసాద వితరణ జరుగుననిఅన్నారు. 29 మంగళవారం రోజున అవాహిత దేవతల పూజలు,హోమాలు, జలదివాసం, పుష్పాదివాసం, హారతి మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగునని, 30 బుధవారం రోజున రోహిని నక్షత్ర యుక్త మిథున లగ్న సుముహూర్తమున కర్తన్యాసం, చాత్రున్యాసం, నవరత్నన్యాసం, భూలక్ష్మి ధజస్తంభ ప్రతిష్ట, బలి ప్రధానం, తీర్థ ప్రసాద వినియో గం గ్రామ బలి పూజలు ప్రారంభం జరుగునని, రాత్రి నుండి గ్రామ రక్షణార్థం దుష్ట గ్రహ భూతగ్రహ, దోష నివారణార్థంగ్రామం చుట్టూ బలిచాట పులగం పోయుట, పాలి చల్లడములు మహా వైభవంగా జరుగునని అన్నారు. ఈ కా ర్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ ని భూలక్ష్మి ధ్వజస్తంభదేవతల కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో పూజా యజ్ఞ నిర్వాహకులు ప్రధాన అర్చకుడు తాతాభట్ల నరసింహ మూర్తి శర్మ, గ్రామ పురోహితుడు మూస ఆంజనేయ శర్మ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ చీర నాగరాజు, నాయకులు రత్నాకర్ రెడ్డి, శ్యామ్, జీడి ఆనందం, పేరాల సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# మేకల దొంగ అరెస్ట్



**నల్లబెల్లి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** మేకలు, గొర్రెలను దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నల్లబెల్లి క్రాస్ జాతీయ రహదారిపై వాహనాలను తలఖీ చేస్తుండగా పోలీసులను చూసి కారును పక్కకు పెట్టి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారించినట్లు తెలిపారు. హైదరాబాద్ ఘట్కేసర్‌కు చెందిన కొత్తకొండ వికాస్ కుమార్, వరంగల్ నగరంలోని కొత్తవాడకు చెందిన బమ్మ తిరుపతి అని ఇద్దరు వ్యక్తులు ఆత్మకూరు మండలం సీతారాంపురం గ్రామంలో రెం డు మేకలు అలాగే నందిగామ గ్రామంలో రెండు మేకలు, రెండు గొర్రెలను దొంగతనం చేసి గుర్తుతెలియని మధ్యవర్తికి అమ్ముకు న్నారు. కొత్తకొండ వికాస్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసు కోగా బమ్మ తిరుపతి పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కొత్తకొండ వికాస్ కుమార్ నుండి టీఎస్ 30 జె 5336 నెంబర్ గల కారును, రూ.20 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తకొ ండ వికాస్ కుమార్ పై కేసు నమోదు చేసి రిమైండర్ కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణు, శ్రావణ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవం



**ఖానాపూర్ ఏప్రిల్24 (జనంసాక్షి):** తర్లపాడ్ ఓంకారేశ్వర ఆలయ 16వ వార్షికోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం ఆలయ అర్చకులు మామిడి పెల్లి హరీష్ కుమార్ ఆచార్యుల బృందం ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, కుంభాభిషేకం, గణపతి పుణ్యాహవాచనం, అఖండ దీప ప్రజ్వలన, సర్వదేవతా హోమం, పూర్ణహుతి, ఆలయ దిగ్బలి తదితర పూజలు వైభవపీతంగా నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి బుక్య జాన్సన్ నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగరాజం, నరసయ్య, రాజేందర్, మహేష్, బీరయ్య, మల్లేష్, మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

- బిసీఈఓ గోవింద్



**ఖానాపూర్ ఏప్రిల్ 24 (జనంసాక్షి):** ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జెడ్పి సీఈవో ఐ.గోవింద్ అన్నారు. గురువారం మండలంలోని దిలావర్పూర్ గ్రామపం చాయ తీని సందర్శించిన సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చేపట్టా లని అన్నారు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి తుది జాబితాను సమర్పించాలని సూచించారు. అనంతరం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీఓరత్నాకర్ రావు లతోపాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన : పులిగిల్ల శ్రీజ



**బచ్చన్నపేట, ఏపీలో24 (జనంసాక్షి):** విద్యార్థి దశ నుండే ఒక నిర్దిష్ట లక్ష్యం చేసుకుని చదివితే ఆ లక్ష్యాన్ని అవలీలంగా చేరవచ్చు అని నిరూపించింది పులిగిల్ల శ్రీజ. వివరాల్లోకి వెళితే జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన పులిగిల్ల కనకయ్య లలితల కూతురు శ్రీజ ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరం బిపిసిలో 440 మార్కులకు 437 మార్కు సాధించి రాష్ట్రంలోనే రెండవ ర్యాంకు సాధించిన వ్యక్తిగా నిలిచింది శ్రీజ రాష్ట్రంలోని రెండవ ర్యాంకు తెచ్చుకున్న సీజన్ కుటుంబ సభ్యులు బంధు వులు గ్రామ ప్రజలు అభినందించి మరింత పై చదువులు చదివి తల్లిదం డ్రులకు గురువులకు పుట్టిన ఊరుకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## బైకును ఢీ కొట్టిన లారీ



**నూగూర్‌వెంకటాపురం,ఏప్రిల్24(జనంసాక్షి):-** ములుగు జిల్లాలో ఏటూరునాగారం మండలం గ్రామ శివారులో జాతీయ ప్రధాన రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది.ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడ ంతో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం వెంక టాపురం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన కల్లూరి రవికిరణ్(32), మట్టి రవి శంకర్ (35)అను ఇద్దరు వ్యక్తులు మేడారం వెళ్లి కుటుంబ సభ్యు లతో మొ క్కలు చెల్లించు కొని తిరిగి బైక్ పై వస్తుండగా వారి వాహ నాన్ని ఏటూరు నాగారం గ్రామ శివారులో రోయ్యూర్ రెండో బ్రిడ్జి వద్ద వెంక టాపురం నుం డి వస్తున్నా లారీఢీ కొట్టడ ంతోవడ్ల రవికిరణ్ అనే వ్యక్తి అక్కడి క్కడే మృతి చెందగా, మరో వ్యక్తి మట్టి రవిశంకర్కి తీవ్రంగా గలయ్యా యని తెలిపారు .కుటుంబ సభ్యులు క్షతగాత్రుని ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి త రలించారు. ఈ ఘటనకు సంబందించిన పూర్తి విరాలు తెలియాల్సి ఉంది.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు



**గణపురం, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** పరకాల మండలం సీతారాంపురంలో జరిగిన వివాహ విందు కార్యక్రమంలో గురువారం గణపురం మండల టిఆర్ఎస్ నాయకులు పాల్గొని గణపురం మండలం అప్పయ్యపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ పల్లెబోయిన సదయ్య కుమార్తె అనూష, రాజు యాదవ్‌లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మోతే.కరుణాకర్ రెడ్డి గణపురం పిఎసిఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి.పూర్ణచంద్ర రెడ్డి మాజీ ఎంపీటీసీలు మంద.అశోక్ రెడ్డి చెన్నూరి. రమాదేవి మధూకర్. గ్రామ కమిటీ అధ్యక్షులు ఏ ల్లబోయినభద్రయ్య, పిల్లి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు,

### ఉషోదయ వాకర్స్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన భారతీయుల మృతికి సంతాపం కొవ్వొత్తుల ర్యాలీ



**మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** కాశ్మీర్ పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన 28 మంది భారతీయుల మృతికి సంతాపంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుండి నెహ్రూ సెంటర్ వరకు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రోవత్తుల ర్యాలీ నిర్వహి ంచడం జరిగింది ఈ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు లయ న్ బొడ్డుపల్లి ఉపేంద్ర మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమ రవీరుల ఆత్మకు శాంతి కలగాలని తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాలబిందెల మల్లయ్య ప్రధాన కార్యదర్శి శంబయ్య కల్లెపు వెంకట్ రెడ్డి, తులసి గిఫ్ట్ సెంటర్ పరం ధామయ్య దాసరి ప్రసాద్ ముల్లంగి వెంకట్ రెడ్డి కాపరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గులాబీ దండులా రజతోత్సవ సభకు కదలి రావాలి

- కుంభమేళా తరహాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగబోతోంది
- తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్షగా గులాబీ జెండా
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత





**ఎల్కతుర్తి(భీమదేవరపల్లి)ఏప్రిల్24(జనంసాక్షి):** తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్షగా నిలబడేది గులాబీ జెండా మాత్రమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.తెలంగాణ బాగుండాలని బీఅర్ఎస్ నాయకులు కోరుకుం టారని. .కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం తమకు ఓట్లు బాగా రావాలని అనుకుంటున్నాలని విమర్శించారు.అరెండు పార్టీలు ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చి ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటాయని మండి పడ్డారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఅర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు.కాంగ్రెస్ చేతగాని ప్రభుత్వమని ప్రజలకు తెలిసిపోయింది .ఎమ్మెల్సీ కవిత అన్నారు.16 నెలల కాంగ్రెస్ పాలనలో 16 పనులు కూడా కాలేదని విమర్శించారు.దేశానికే సేవలు అందించడానికి టీఆర్ఎస్ నుంచి బీఅర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందామని వివరించారు.తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఅర్ఎస్ రజతోత్సవ సభఅని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం కో సం 2001లో కేసీఆర్ పిడికిలి బిగించి ఉద్యమాన్ని మ్నొదలు పెట్టారని గుర్తు చేశారు.ఉద్యమం మ్నొదలు పెట్టినప్పుడు ఉత్పన్నమైన అన్ని అనుమా నాలను కేసీఆర్ పటాపంచలు చేశారన్నారు.ఒక రక్తం చుక్క కూడా చిందిం చకుండా రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు.ఎన్ని అవాంతరాలు ఎదురైనా గుండె ధైర్యంతో బీఅర్ఎస్ పార్టీని, తెలం గాణను కాపాడుతూ వచ్చారని అన్నారు.తెలంగాణ ఉట్టిగనే రాలేదు..కేసీఆర్ మేధ స్సును కలిగిస్తే వచ్చిందని అన్నారు.తెలంగాణ రాజకీయ కుట్రలను చేధించి తెలంగాణ వాదాన్ని ప్రజల్లో నిలబెట్టారని తెలిపారు. తెలంగాణ నవయువకుల కోసం రజతోత్సవ సభ జరుగుతుందని స్పష్టం చేశారు.సభకు యువత పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ జరుగుతుందని చెప్పారు.మహిళలకు నెలకు 2500,తులం బంగారం,స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ మ్మోసం చేసిందని కవిత విమర్శించారు.కాంగ్రెస్ చేతిలో మ్మోసపోయిన ప్రతి ఒక్కరు.సభకు రావాలని అహ్వానించారు.మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు వేశారని,మున్సిపాలిటీల్లో,మార్కెట్ కమిటీ ల్లో మహిళాలకు రిజిస్ట్రేషన్లు కల్పించారని.బీసీ,ఎస్సీ, ఎస్టీ అడబిడ్డల కోసం ప్రతి జిల్లాలో హాస్టల్ తో కూడిన డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మహిళలు భారీ ఎత్తున సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు రైతుల గుండెలపై చేయి వేసుకొని పడుకునే పరిస్థితిని కేసీఆర్ సృష్టిస్తే,, కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి లక్షలాది ఎకరాలు ఎండిపోయేలా చేసిందని విమర్శించారు కాంగ్రెస్ పార్టీ రైతులంతా గులాబీ దండులా రజతోత్సవ సభకు కదలి రావాలని కోరారు.తెలంగాణలోని ప్రజాస్వామ్యులంతా కూడా సభకు కదిరావాలని సోషల్ మీడియా సైనికులు కూడా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ కోసం కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు ఎందరో అమరులయ్యారు 25 సంవత్సరాల సభ రజతోత్సవ సభను ఈనెల 27న జరుపుకుంటున్నాం కెసిఆర్ రాష్ట్ర రాజకీయాలను కాదు దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలరు సభ కోసం సిపికి బందోబస్తు గురించి వివరించడం జరిగిం దన్నారు పోలీసు బంధవస్తుతో పాటు బీఅర్ఎస్ వాలంటీర్లు మహిళా వాలం టీర్లు ఏర్పాటు చేయడం జరిగింది అన్ని రకాల సదుపాయాలు పార్కింగ్ సమయం కార్యకర్తల కోసం చేస్తున్న మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా అధ్యక్షులు వినయ్ భాస్కర్,మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్,ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,తక్కలపల్లి రవీందర్రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదారి బాలమల్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం,మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్,సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్,ఎల్తూరి స్వామి, మాజీ మంత్రులు,ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్లో హిందువులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- బిజెపి సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య



**నిర్మల్ రూరల్,ఏప్రిల్24(జనంసాక్షి):** జమ్మూ కాశ్మీర్లో హిందు పర్యాటకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నిర్మల్ జిల్లా బిజెపి సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య అన్నారు.ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి నివాళులర్పిస్తూ గురువారం స్థానిక శివాజీ చౌక్ లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.అనంతరం భూమయ్య మాట్లాడుతూ కాశ్మీర్ అందాలను తిలకించడానికి వెళ్లిన వారిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడం బాధాకరమని ఆయన అన్నారు.పాకిస్తాన్ లష్కరే తోయిబా ఉగ్రవాదులు మేమే ఈ పని చేసిన మని ప్రకటిస్తున్నారని,దీనికి భారీ మూల్యం చెల్లించుకుంటారని అన్నారు.హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని యావత్ ప్రపంచం గమనిస్తుందని ఆయన తెలిపారు. జమ్మూ కాశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దు చేసిన తర్వాత కాశ్మీర్ అభివృద్ధి చెందుతున్న తరుణంలో,మళ్లీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ఇటువంటి దాడులు చేస్తున్నారని ఆయన అన్నారు.కేవలం మతం పేరిట ఉగ్రవాదులు దాడులు చేయడం సిగ్గుచేటని,దేశ ప్రజల సహనాన్ని పరీక్షి స్తున్నారని ఆయన అన్నారు. ఇంత పెద్ద సంఘటన జరిగినా దేశంలో కుహనా లౌకికవాదులు ఏమి మాట్లాడలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెగకిలించడానికి ప్రపంచంలోని అమెరికా,ఇజ్రాయిల్,రష్యా తదితర దేశాలు భారతదేశానికి మద్దతిస్తున్నాయని ఆయన తెలిపారు. మరి నరేంద్ర మోడీ అంటే ఏమిటనేది త్వరలోనే పాకిస్తాన్ కు రుచి చూపిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆడెపు సుధాకర్, కమల్ నయన్, వెంకటపతి,అలివేలుమంగ,భాస్కర్ రమేష్ గౌడ్,ఉన్నారు

### కేసీఆర్ ను కలిసిన "బబ్బూరి శ్రీకాంత్ గౌడ్"



**పాలకుర్తి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మా జీ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావును జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ గురువారం ఎర్రవెల్లి నివా సంలో మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహి రంగ సభ, తదితర అంశాలపై మాజీ సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేశారన్నారు, అలాగే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచిం చినట్లు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

# విద్యుత్ షాక్ కు గురై ఎద్దు మృతి

**రేగొండ,ఏప్రిల్24(జనంసాక్షి):** ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ కు గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దంపల్లిలో గురువారం జరిగింది. పెద్దంపల్లి గ్రామానికి చెందిన పసుల శంకరయ్య ఎడ్ల బండిని తోలుకొని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు.ఎడ్లను చేనులో వదిలి వ్యవసాయ పనులు చేసుకుంటుండగా కాలువ కట్టకు ఉన్న 11 కేవి ట్రాన్స్ఫార్మర్ వద్దకు ఎద్దు వెళ్ళింది. ట్రాన్స్ఫార్మర్ కిందికి ఉండడంతో విద్యుత్ వైర్లు తాకి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల విలువ గల ఎద్దు మృతి చెందడంతో ఆ రైతు కుటుంబ సభ్యులు రోధిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. కిందికి ఉన్న కంచలేని 11 కెవి ట్రాన్స్ఫార్మర్ కు మరమ్మత్తులు చేసి పైకి అమర్చాలని పలుమార్లు రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మృతి చెందిన ఎద్దుకు నష్టపరిహారం చెల్లించి రైతుకు న్యాయం చేయాలని, కిందికి ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు మరమ్మత్తులు చేసి పైకి అమర్చాలని, చుట్టూ కంచ వేయాలని రైతులు కోరుతున్నారు.